ఈనాడు
THE LARGEST CIRCULATED DAILY IN ANDHRA PRADESH

ఎంబీబీఎస్ విద్యార్థులకు 'నిష్క్రమణపరీక్ష'!

- **కోర్సు ఆఖరున నిర్వహించే యోచనలో కేంద్రం**
- **తొలుత ఐచ్ఛికం.. తదనంతర కాలంలో తప్పనిసరి!**

ఈనాడు, దిల్లీ: ఎంబీబీఎస్‌లో చేరాలంటే ప్రవేశ పరీక్ష ఉన్నట్లుగానే ఆ కోర్సు పూర్తి చేసిన వారికి 'నిష్క్రమణ పరీక్ష' (ఎగ్జిట్ ఎగ్జామ్) నిర్వహించాలని కేంద్ర ఆరోగ్యమంత్రిత్వశాఖ భావిస్తోంది. దీనిని దేశవ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేటు వైద్యకళాశాలలన్నింటికీ వర్తింపజేయాలని యోచిస్తోంది. ఈ ప్రతిపాదన ప్రకారం.. నిష్క్రమణ పరీక్షలో ఉత్తీర్ణులైన ఎంబీబీఎస్ విద్యార్థులకు 'భారత వైద్య మండలి' (ఎంసీఐ) గుర్తింపునిస్తుంది. తద్వారా దేశంలో ఎక్కడైనా వైద్యుడిగా పని చేయటానికి అనుమతి లభిస్తుంది. ప్రస్తుతం అమల్లోఉన్న విధానం ప్రకారం.. ఒకరాష్ట్రంలో పని చేయటానికి ఎంసీఐ శాఖ నుంచి గుర్తింపు పొందిన వైద్యుడు.. మరొక రాష్ట్రానికి వెళ్లి పని చేయాలంటే తన గుర్తింపును సదరు కొత్తరాష్ట్ర ఎంసీఐ శాఖకు బదిలీ చేయాల్సి ఉంటుంది. నిష్క్రమణపరీక్ష అమల్లోకి వస్తే ఈ సమస్య ఉండదు. దేశమంతటా ఎక్కడైనా పని చేయవచ్చు. నిష్క్రమణపరీక్షను ప్రభుత్వం తొలుత ఐచ్ఛికంగానే ప్రవేశపెట్టనుందని.. తదనంతరకాలంలో దానిని తప్పనిసరి చేస్తుందని ఆరోగ్యశాఖమంత్రి జె.పి.నడ్డా సన్నిహితవర్గాలు వెల్లడించాయి. ఎంబీబీఎస్ వైద్యుల్లో పడిపోతున్న ప్రమాణాలపై వ్యక్తమవుతున్న ప్రజాందోళన దృష్ట్యా.. కేంద్రం నిష్క్రమణపరీక్ష ప్రతిపాదనను పరిశీలిస్తున్నట్లుగా ఆ వర్గాలు తెలిపాయి.

పీజీ ప్రవేశాలకు వడబోత!: ప్రస్తుతం ఏటా పీజీ వైద్యప్రవేశపరీక్షలకు దాదాపు లక్షమంది ఎంబీబీఎస్ వైద్యులు హాజరవుతున్నారు. వీరిలో అర్హత సాధిస్తున్నది 25 వేలమంది మాత్రమే. ఈ నేపథ్యంలో.. నిష్క్రమణపరీక్షను ఒక ప్రాతిపదికగా తీసుకొని.. దాంట్లో ఉత్తీర్ణత సాధించిన వారు మాత్రమే పీజీప్రవేశపరీక్ష రాయటానికి అర్హులనే నిబంధనను కూడా ప్రభుత్వం తీసుకొచ్చే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. మరోవైపు, కొన్నిరకాల ఔషధాల ఆన్‌లైన్ అమ్మకాల పర్యవేక్షణకు నిబంధనలను రూపొందించాల్సిందిగా 'భారత ఔషధాల కంట్రోలర్ జనరల్'కు కేంద్ర ఆరోగ్యశాఖ ఆదేశాలు జారీ చేసినట్లు తెలిసింది. ఇటీవల కొన్ని ఆన్‌లైన్ సంస్థలు లైసెన్స్ లేకుండానే ఔషధాలను విక్రయిస్తున్నట్లు తేలటంతో దీనిపై కేంద్రం దృష్టి పెట్టినట్లు సమాచారం.